# శ్రద్ధ

మల్లాది వెంకట కృష్ణమూర్తి



ఆ రోజు బాగా చిరాగ్గా వున్నాడు రామబ్రహ్మం. కిటకిటలాడుతున్న బస్సులో, ఎనిమిది కిలోమీటర్ల ప్రయాణం చేసి రావటంవల్ల విసుగ్గా వుంది రామబ్రహ్మానికి.

గొడుగుని గోడకి వున్న మేకుకి తగిలించి, పడకకుర్చీలో వాలాడు. మొహమయినా కడుక్కునే ఓపికలేక. భార్యామణి కాఫీ అందించాక స్థిమితపడ్డాడు కొద్దిగా.

భర్త తెచ్చిన అట్టపెట్టె చూసి అడిగింది భార్య. "చెప్పులు కొనుక్కున్నారా?"

అవునన్నట్లుగా తలూపాడు. పెద్దగా అరుస్తూ లోపలికి వచ్చిన ముగ్గురు కొడుకులని చూసి ముఖం చిట్లించాడు రామబ్రహ్మం. తండ్రిని చూసి తక్కున ఆగిపోయారు ముగ్గురూ.

"స్టోర్స్ నుంచి బొంబాయి రవ్వ తెచ్చావా?" పెద్ద కొడుకుని అడిగాడు రామబ్రహ్మం

"ఉహు. తేలేదు."

"నిన్నరాత్రి స్కూల్ చూరో దాచిన పుస్తకాలు తెచ్చావా?"... రెండో కొడుకుని అడిగాడు.

"ఉహు. తేలేదు." మర్చిపోయారు ఇద్దరూ.

"మరపులేదు. శ్రద్ధలేదు మీకు. చెప్పిన పనిమీద శ్రద్ధవుంటే ఎలా మర్చిపోతారు? చేసే పనిమీద ఆ కాస్సేపయినా లగ్నం చేయాలి మనసుని" కోప్పడ్డాడు ఇద్దరు కొడుకులనీ.

తలలు వంచుకున్నారు అలవాటుగా.

మూడో కొడుకు అట్టపెట్టె తెరచి రెండు కొత్త చెప్పులు బయటకి తీశాడు చూద్దామని. వాటిని పరీక్షగా చూసి చెప్పాడు తండ్రికి ఆత్రంగా.

"నాన్నా కుడిచెప్పు పెద్దది. ఎడంచెప్పు చిన్నది."

రామబ్రహ్మం వాటిని అందుకుని చూశాడు. నిజమే, కుడి చెప్పు సైజ్ తొమ్మిది. ఎడం చెప్పు సైజు ఏడు. రామబ్రహ్మం చూసుకోలేదు. తన తప్పు పిల్లలకు తెలియటం ఇష్టంలేక అన్నాడు.

"వెధవ. కొట్టువాడు తప్పు పేక్ చేశాడు. వీధి చివరేగా. రేపు ప్రొద్దునే మార్చాలి."

గట్టిగా నవ్వుతున్న కొడుకుల వంకచూసి అరిచాడు రామబ్రహ్మం అసహనంగా.

"నవ్వకండి. లోపలకి తగలడండి?"

రామబ్రహ్మం భార్య అన్నది మృదువుగా భర్తతో.

"పిల్లల్ని అంటారుకాని, చూస్తున్నాగా ఈమధ్య మీకూ కూడా అశ్రద్ధ పెరిగిపోతోంది."

"నాది కాదు తప్పు."

"డబాయించకండి నా దగ్గర."

రెండు నిముషాల తర్వాత "వీధి చివర వుండే చెప్పులషాపులో పనిచేసే కుర్రాడు వరండా గుమ్మం దగ్గిర ఆగి, హాల్లో పడకకుర్చీలో పడుకునివున్న రామబ్రహ్మంతో చెప్పాడు నెమ్మదిగా.

"సార్. పొరపాటుగా మాషాప్‌లో మీరు..

'అవును. మీదే తప్పు. మారిపోయిందో చెప్పు.'

రామబ్రహ్మం చెప్పులపెట్టె అతనివైపు తోశాడు. "నేనే రేపు వుదయం వద్దామనుకుంటున్నాను."

"చెప్పులు మారాయా?" అడిగాడు ఆశ్చర్యంగా అతను.

"అవును. మరింకేమిటి?"

"గొడుగు సార్. మీది మా షాప్‌లో వదిలేసి, లేడీస్ అంబరెల్లా తెచ్చారు మరొకరిది పొరపాటున."

ఆ కుర్రాడి చేతిలో రామబ్రహ్మం గొడుగు వుంది. రామబ్రహ్మం గొడుగు వుండాల్సిన స్థానంలో ఆడవాళ్ళు ఉపయోగించే ఓ గొడుగు వ్రేలాడుతోంది.

"ఏం జరిగింది నాన్నా?" ముగ్గురు కొడుకులూ నవ్వుతూ అడిగారు తండ్రిని, లోపలి గదిలోంచి బయటకు వస్తూ. ★